

ఆస్టర్ నారాయణాద్రిలో అబ్బురపరిచే సర్జరీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

చంకలో కణితి ఉన్న స్వామి (62)కి ఆస్టర్ నారాయణాద్రిలో అబ్బురపరిచేలా సర్జరీ జరిగిందని సిఒఒ డాక్టర్ శ్రీధర్ మూని తెలిపారు. రేణిగుంట రోడ్డులోని ఆ హాస్పిటల్ వద్ద శనివారం ఆయన విలేకరితో మాట్లాడుతూ 62 సంవత్సరాల స్వామి అనే వ్యక్తి కుడి చంకలో కణితి పెరగడంతో ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ లోని ప్లాస్టిక్ సర్జరీ డాక్టర్ డి. విజయ్ కుమార్ రెడ్డిని ఇటీవల సంప్రదించారు. కొవ్వు కణితలు సాధారణం అయినప్పటికి ఛాతి నుండి మొదలయి చేతి వరకు ఉండడం చాలా అరుదని పేర్కొన్నారు. ఆపరేషన్ తరువాత ఆ పేషెంట్ కు మునుపటి ఇబ్బందులన్నీ తగ్గిపోయి హాయిగా జీవిస్తున్నట్లు రోగి స్వామి వైద్యులకు వివరించారు.



తొలకరి వ'ర్రీ'

ఖరీఫ్‌లో సగానికి పడిపోయిన పంటల సాగు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాలను తొలకరి వర్షాలు పలకరిస్తున్నాయి. ఈ ఏడాది ముందుగానే తొలకరి పలకరించడంతో ఖరీఫ్ అనుకున్నంత ఆశాజనకంగానే ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.. ఈ పరిస్థితుల్లో వర్షాలు తగ్గుముఖం పడితే తెలుగుగంగ నీరే దిక్కు. అయితే ఖరీఫ్ ఆరంభం నుంచే తెలుగుగంగ కాలువకు అధికారులు నీటిని విడుదలను ఆపేశారు. దీంతో వరి, వేరుశెనగ పంటలు సాగు చేసేందుకు రైతులు సంకోచిస్తున్నారు. ఇంకో వైపు పెట్టుబడి, ఎరువుల ధరలు విపరీతంగా పెరగడం కూడా ఖరీఫ్ సాగుపై ప్రభావం చూపుతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది యాభై శాతం మేర ఖరీఫ్ సాగు తగ్గినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గత అనుభవాలు దృష్ట్యా వరితో పాటు ఆరుతడి పంటలపైనే ఎక్కువ దృష్టిపెట్టాలని వ్యవసాయాధికారులు సలహాలిస్తున్నారు.

5 వేల హెక్టార్లలోనే సాగు!

శ్రీకాళహస్తి వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో(శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, కెవిబిపురం మండలాల్లో) సాధారణంగా ఖరీఫ్‌లో 10,476 హెక్టార్లలో పంటల సాగు ఉంటుంది. అయితే ఈ ఏడాది కేవలం 5,869 హెక్టార్లలోనే పంటలు సాగు జరిగిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. 7,784 హెక్టార్లలో వరి సాగవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 4,485 హెక్టార్లలో మాత్రమే విత్తు పడింది. 1500 హెక్టార్లలో వేరుశెనగ సాగవ్వాల్సి ఉండగా కేవలం 634 హెక్టార్లలో మాత్రమే సాగు జరిగింది. 1300 హెక్టార్లలో నవ్వ పంట సాగవ్వాల్సి ఉండగా 700 హెక్టార్లలో మాత్రమే సాగు జరిగింది. వరి, వేరుశెనగ సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరగడం, నీటి ఖర్చులు అదనం కావడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాల్సి వస్తోంది. పెట్టుబడి అధికమైనా కానీ దిగుబడులు, ఆదాయం బాగా వస్తుండడంతో రైతులు సంప్రదాయ పంటలు మాని పుచ్చ, కర్బూజ లాంటి ఉద్యానవన పంటల వైపు మొగ్గుతున్నారు. ఓ వైపు వర్షాలు ఆశించిన మేర పడకపోవడం, తెలుగుగంగలో నీరు లేకపోవడం, చెరువులన్నీ నిండుకోవడంతో ఈ సారి ఖరీఫ్ నిరాశాజనకంగానే ప్రారంభమైందని చెప్పుకోవాలి.

- **పెరిగిన పెట్టుబడులు, ఎరువుల ధరలు**

ఏటేటా పెట్టుబడి, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగిపోతూనే ఉన్నాయి. గతేడాదికంటే ఈ ఏడాది 20 శాతం పెరిగాయి. ఎకరా పొలంలో వరి సాగుకు రూ.20 నుంచి 30 వేలకు పెరిగింది. వేరుశెనగకు రూ.30 నుంచి రూ.50 వేలకు పెరిగింది. ఇక ఎరువుల సంగతైతే చెప్పనక్కర్లేదు. ఎరువులపై కూడా జీఎస్టీ విధించడంతో యూరియా రూ.200 నుంచి రూ.280కు, డీఏపీ ఎరువులు ఏకంగా రూ.వెయ్యి నుంచి రూ.1700కు పెరగడం గమనార్హం. పురుగు మందుల అమ్మకాలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఫెర్టిలైజర్ దుకాణాల్లో గుర్తింపులేని కంపెనీల నుంచి సైతం మందులు ప్రత్యక్షమవుతున్నాయి. అవి నకిలీవా..? నాణ్యమైనవా అన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. తెలుగు నిరాశకంటూ ఫెర్టిలైజర్ దుకాణాలు వెతుకుతున్న రైతులకు నాసిరకం పురుగుమందులు అంటగడుతుండటంతో రైతులు మోసపోతున్నారు. వాటిని పిచికారీ చేసినా ప్రయోజనం శూన్యమవుతుండటంతో మళ్లీ పురుగు మందులు కొనాల్సి వస్తోంది.

ఎరువులు సిద్ధం: రమేష్‌బాబు, ఏడీఏ, శ్రీకాళహస్తి

ఈ ఏడాది వర్షాలు ఆశించిన మేర కురిసే అవకాశాలున్నాయి. కొంచెం ఆలస్యమైనా ఆశించిన రీతిలోనే ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. రైతులకు అందుబాటులో ఉండేలా 667 టన్నుల ఎరువులను వ్యవసాయ భరోసా కేంద్రాల్లో, సింగిల్‌విండో కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాం. ఇప్పటి వరకు 393 టన్నుల ఎరువులను రైతులు కొనుగోలు చేశారు. నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నివారణపై దృష్టి సారిస్తాం.

8 నుంచి అత్యంత పారదర్శకంగా ఇసుక : కలెక్టర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నూతన ఇసుక విధానం ఈనెల 8న సోమవారం నుంచి ప్రారంభించాలని, తద్వారా ప్రజలకు అత్యంత పారదర్శకంగా నామమాత్రపు ధర నిర్ణయించి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సంబంధిత అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం గుర్తించిన ఇసుక స్టాక్ పాయింట్లలో రాయల్టీ మూడు నెలలకు అవసరమయ్యే ఇసుక స్టాక్ డంప్ చేసి ప్రజలకు అందుబాటులో ఉంచి సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పర్యావరణం, సుప్రీంకోర్టు జడ్జిమెంట్, ఎన్‌జిటి ఉత్తర్వు మేరకు మాత్రమే చర్యలు ఉండాలని సూచించారు. నామమాత్రపు నిర్ణీత ధరను డిజిటల్ పేమెంట్ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. తిరుపతి జిల్లాలో నాలుగు స్టాక్ పాయింట్లు ఉన్నాయని, శ్రీకాళహస్తి డివిజన్ సుబ్బరాయుడు కండ్రిగలో రెండు స్టాక్ పాయింట్ల వద్ద ఒక మెట్రిక్ టన్నుకు రూ.200గా నిర్ణయించామన్నారు. పిచ్చాటూరు మండలంలో ఎకె బీడులో రూ.200 మెట్రిక్ టన్నుగా, సూళ్లూరుపేట డివిజన్ దొరవారిసత్రం మండలం మామిళ్లపాడు వద్ద మెట్రిక్ టన్ను ధర రూ.465, గూడూరు డివిజన్ వెంకటగిరి మండలంలో మొదలగుంట స్టాక్ పాయింట్ వద్ద ధర రూ.590గా నిర్ణయించామన్నారు. ఒకరికి ఒకరోజుకు ఆధార్ కార్డు మేరకు 20 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇస్తారన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక ఇవ్వాల్సి ఉంటుంది.ఎటువంటి పరిస్థితుల్లోనూ యంత్రాలను వాడరాదు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, అదనపు ఎస్పీ వెంకట్రావు, సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, జిల్లా గనుల శాఖ అధికారి ప్రకాష్ కుమార్, ఈఈ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అశోక్ కుమార్, ఇంఛార్జి డిపిఒ సుశీల దేవి, డిప్యూటీ సిఈఓ ఆదిశేషరెడ్డి, ఎస్ ఈ ఇరిగేషన్ విజయ్ కుమార్, జిల్లా రవాణా అధికారి ఆదినారాయణ, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ విజయ కుమార్ పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా తిరుపతిని తీర్చిదిద్దుతా

టిడిఆర్ బాండ్లపై సిఎం దృష్టికి
శ్రీనివాస సేతు పేరు మార్పుపై పరిశీలన
కార్పొరేషన్ అధికారులతో ఆరణి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతిని సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా, యాత్రికులకు ఇబ్బందులు రాకుండా సకల సదుపాయాలు కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, తాగునీరు, పారిశుధ్యంతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంటామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శనివారము తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో తిరుపతి అభివద్ధిపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మూడు గంటల సేపు అధికారులతో చర్చించారు. యాత్రాస్థలం కావడంతో ప్రజలకు తాగునీరుతో పాటు, సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ముఖ్యంగా గుంతలుగా మారిన రోడ్లను బాగు చేయడానికి ప్యాచ్ వర్క్ లు చేపట్టాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులకు సూచించారు. మురికి కాలువలు పూడికలు తీత యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. డ్రైనేజ్ కాలువలు పొంగకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగానికి ఆదేశించారు. టిడ్కో ఇళ్లు సకాలంలో లబ్ధిదారులకు అందించాలని సూచించారు. యాత్రికుల కోసం పార్కులను అభివద్ధి చేసి ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. మాస్టర్‌ప్లాన్ పేరుతో గత ప్రభుత్వం నిర్మించిన రహదారులు నాలుగు నెలలు కాకుండానే గుంతల మయం కావడం ఇంజనీరింగ్ విభాగంలో డొల్లతనం కనబడుతోందన్నారు. చింతలచేను రోడ్డు నుంచి కాటన్‌మిల్లు వైపు వేసిన వంద అడుగుల మాస్టర్‌ప్లాన్ రోడ్డు నాణ్యత లేకుండా కుంగిపోవడంపై ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌కు రూ.55 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని, పనులను బట్టి దశలవారీగా చెల్లిస్తామన్నారు. ఎన్నికల కోసం ఇంజినీరింగ్ విభాగం అధికారులు టెండర్లు పిలవకుండానే అనేక పనులు చేశారని, వాటికి బిల్లులు చెల్లించవద్దన్నారు. బడ్జెట్‌కు మించి పనులు చేపట్టడం కార్పొరేషన్‌కు భారంగా మారిందన్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి ప్రజాప్రతినిధులు ఇష్టానుసారంగా పనులు చేశారన్నారు. 1200 మంది లబ్ధిదారులకు టిడిఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉందని, ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళతానన్నారు. బాండ్లు పంపిణీకి కమిటీ వేసి అర్హులైన వారికి సకాలంలో ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో గరుడవారధి పేరును వైసిపి హయాంలో శ్రీనివాస సేతు అని మార్చారని, ఈ విషయమై సిఎం దృష్టికి తీసుకెళ్లి పేరు మార్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సమీక్షలో 2 కోట్ల 39 లక్షలు వెచ్చించి డబుల్ డెక్కర్ బస్సు కొనుగోలు చేసిన విషయమై అధికారులు తన దృష్టికి తీసుకురాకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య డబుల్ డెక్కర్ బస్సు గురించి ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని, కాల్వలు నిరంతరం శుభ్రపర్చడం, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించడం చేయాలని మునిసిపల్ కార్పొరేషన్ పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బందికి కమిషనర్ అదితిసింగ్ ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి నగరంలోని స్కావేంజర్స్ కాలనీ, కొత్తూరు, శివజ్యోతి నగర్, అయ్యప్ప కాలనీ ప్రాంతాల్లో శనివారం ఉదయం కమిషనర్ పరిశీలించారు. ముఖ్యంగా డయేరియా, మలేరియా, డెంగీ ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలువలు, రహదారులు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వవుండ కుండా చూడాలని, క్లోరినేషన్ ప్రకియను నిత్యం నిర్వహించాలని, దోమలు వ్యాపించకుండా మందులు స్ప్రే చేయించాలని, బ్లీచింగ్ చల్లించే ప్రకియ నిరంతం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, శానిటరి సూపర్ వైజర్లు చెంచెయ్య, సుమతి పాల్గొన్నారు. తొలుత భారత ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి పురస్కరించుకుని చిత్రపటానికి పూలు సమర్పించి నివాళి అర్పించారు.

స్వర్ణముఖి నిండా వ్యర్థాలు



ప్రజాశక్తి- ఏర్పేడు

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలో డంపింగ్ యార్డ్ లను ఏర్పాటు చేశారు. అయితే వాటి మరమ్మత్తులు చేపట్టకపోవడంతో కొంతకాలానికే ఆ డంపింగ్ యార్డ్‌లు నిరుపయోగంగా మారిపోయాయి. దీనికి నిదర్శనం పాపానాయుడుపేట, మర్రి మంద గ్రామాలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ సమస్యను గుర్తించారు. సరైన డంపింగ్ యార్డ్ సౌకర్యాలు లేకపోవడంతో ఆయా పంచాయతీ వారు సేకరించిన వ్యర్థాలను పాపా నాయుడు పేట –పెనుమల్లం రోడ్డుకు ఆనుకుని పక్కనే ఉన్న స్వర్ణముఖి నదిలో చెత్తను వేస్తున్నారు. ప్రజల అనారోగ్య సమస్యలకు కారణమయ్యే పరిస్థితులను పరిగణలోకి తీసుకొని వెంటనే స్పందించి అక్కడ చెత్త వేయడం ఆపాలని, పంచాయతీలకు కేటాయించి ఉన్న డంపింగ్ యార్డ్ లను మరమ్మత్తులు చేసుకోవాలని, వాటిని వినియోగంలోకి తేవాలని పాపా నాయుడుపేట, మర్రి మంద పంచాయతీలకు ఏర్పేడు మండల జనసేన పార్టీ అధ్యక్షులు కిరణ్ రామిశెట్టి కోరారు.

చిన్నారులు చదివే చోట...

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ప్రజాశక్తి - కెవిబిపురం

'ఏదైనా జరిగితే అప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు ఆగమేఘాలపై యుద్ధప్రాతిపదికన హంగామా చేస్తారు. అయితే ముందుగానే స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకుండా చూడాలని ఎంత మొరపెట్టుకున్నా ముందుగా మాత్రం స్పందించరు. కెవిబిపురం మండలం పెరిందేశం ప్రైమరీ పాఠశాలలు చిన్నారులు చదివే చోట విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. చిన్నారుల చేతులకు అందేలా విద్యుత్ తీగలు ఉండడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వర్షాకాలం ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని భయపడుతున్నారు. విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచాల్సిన విద్యుత్ అధికారులు ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంతో ఉన్నారన్నది వారి ఆరోపణ. పాఠశాలకు వచ్చిన చిన్నారులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఒకరిపై ఒకరు సరదాగా నీళ్లు చల్లుకున్నా షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకుకు అతి సమీపంలోనే ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ పాఠశాలలో 60 మంది చిన్నారులు విద్యను అభ్యసిస్తున్నారు. ఎటువంటి ప్రమాదం జరగక ముందే విద్యుత్ తీగల ఎత్తు పెంచి, ప్రమాదాన్ని నివారించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.



కౌలురైతుపై దాడి అన్యాయం

తిరుపతి సిటీ : కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావుపై జరిగిన దాడిని ఎపి రైతుసంఘం తిరుపతి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత మాట్లాడుతూ అర్హులైన వారికి నిలుపుదల చేసిన సామాజిక పెన్షన్లను సోషల్ వెల్ఫేర్ అధికారులతో సంప్రదించి ఇప్పించేందుకు కృషిచేసినందుకు రామారావుపై కక్షసాధింపుగా టిడిపి వర్గీయులు దాడిచేయడం అమానుషమన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు.

స్విమ్స్‌లో సిఎంఇ విజయవంతం

తిరుపతి సిటీ : స్విమ్స్‌లో మెడిసిన్, పిడియాట్రిక్స్, టివి, ఆర్‌డి, ఫిజియాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం విజయవంతంగా శనివారం జరిగిందని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఫిజియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ హిమజ, మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ వి.సమీరజ, టిబి ఆర్‌డి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎఆర్ చైతన్య, పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ పునీత్ పటాక్ పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి సిటి కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని, సకాలంలో సమన్లు, వారెంట్లు సర్వ్ చేయాలని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అన్నారు. తిరుపతి జిల్లా కోర్టు కానిస్టేబుళ్లతో పోలీసు మైదానంలో శనివారం సమీక్షా సమావేశం జరిగింది. నేరం చేస్తే శిక్ష తప్పదు అనే సందేశాన్ని సమాజానికి ఇవ్వాలని, అపుడే పోలీసుల పనితీరు సార్థకం అవుతుందన్నారు. సంచలనాత్మక కేసుల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు పరిపాలన, కులశేఖర్ శాంతిభద్రతలు, డిఎస్పీలు రవి మనోహర్ ఆచారి తిరుపతి, రమణ కుమార్ తిరుపతి ట్రాఫిక్ పాల్గొన్నారు.


చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్‌పి అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను విస్తృతంగా పెంచారు. గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా నిర్మూలనకు స్పెషల్ పార్టీ పోలీసులతో పకడ్బందీ చర్యలు చేపట్టారు. విద్యాసంస్థల సమీపంలోని దుకాణాలపై రైడ్ చేయాలన్నారు. మాదక ద్రవ్యాల రహిత తిరుపతి జిల్లా సాధన లక్ష్యంగా జిల్లా పోలీసులు కార్యాచరణ చేపట్టాలన్నారు.

హోంగార్డులకు రూ.5లక్షల చెక్కులు

ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డులను సన్మానించి, రూ.5 లక్షల చెక్కులను ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అందజేశారు. అనారోగ్యంతో మరణించిన ఓ హోంగార్డు కుటుంబ సభ్యులకు మరో ఐదు లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. జిల్లా హోంగార్డులు ఒకరోజు జీతాన్ని విరాళంగా ఇచ్చి సదరు హోంగార్డుకు ఆర్థిక చేయూతనిచ్చి, తమ ఐక్యతను చాటుకున్నారు. ఉద్యోగ విరమణ పొందిన రాధాక్రిష్ణ, గోపాల్‌రెడ్డిలను సన్మానించారు. టిటిడి విజిలెన్స్‌లో విధులు నిర్వహిస్తూ మోహన్ అనారోగ్యంతో మృతిచెందారు. హోంగార్డుల ఒకరోజు వేతన నిధిని భార్య కవితకు అందజేశారు.

'విశ్వం'లో నంబర్ 1 కోచింగ్



ప్రజాశక్తి-తిరుపతి సిటి

పోటీ ఎక్కడైనా...పరీక్ష ఏదైనా.. అందులో విజేతలు విశ్వం విద్యార్థులే. పోటీ పరీక్షలకు తర్ఫీదు ఇవ్వడంలో తమకు తామే సాటి అని విశ్వం విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.విశ్వనాధ్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టరు ఎన్.విశ్వచందన రెడ్డి తెలిపారు. స్థానిక వరదరాజునగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్ ప్రాంగణంలో వారు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 30 సంవత్సరాలకుపైగా పోటీ పరీక్షల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తూ అటు సైనిక్, ఇటు నవోదయ ప్రవేశంలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ, వేలాది మంది విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేశామన్నారు. తమ స్కూల్‌లో శిక్షణ పొందిన వారు అనేక మంది డిఫెన్స్ రంగంలో ఉన్నత పదవుల్లో విధులు నిర్వహిస్తుండడం తమతో పాటు దేశానికీ గర్వకారణమన్నారు. విద్య ద్వారా ఉపాధి, సంపాదనే కాదు విలువలు, విజ్ఞానం పెంపొందుచుకునేలా చేయడంలో కొన్ని దశాబ్దాలుగా తాము సఫలీకృతం అయ్యామన్నారు.

ప్రతి ఏడాదీ దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరుగుతున్న సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో సీట్లు కైవసం చేసుకోవడం ఆనవాయితీగా మారిందన్నారు. బెంగుళూరులోని రాష్ట్రీయ మిలటరీ స్కూల్ ప్రవేశపరీక్షల్లో విశ్వం విద్యార్థి వి.హర్షిత్, ఆర్ఐఎంసి డెహ్రాడున్‌కు కెవి కీర్తన్ సీట్లను సాధించారు. సైనిక్‌లో ఆరోతరగతి ప్రవేశపరీక్షలో పి.పునీత సాయి 281/300, వై.గహన్ ఆదిత్యరెడ్డి 265, జిజె.యశ్విన్ కుమార్263, టి.కుషల్‌కుమార్ 263, 9వ తరగతి ప్రవేశ పరీక్షలో 300 మార్కులకు గాను ఇ.రోహికత్ 364, కె.చెంచుశశాంక్ 352, కె.కరన్ 338, బి.లోచన్ 336, ఈ.శ్రీరామ్ 334, కె.పుజిత్ 332, ఎపి.నరసింహ 326, పిఎల్ఎన్.సాయి 326, పి.అజయ్‌కుమార్ 326, టిజి.పోతన్‌రాజ్ 324, మార్కులు సాధించి సైనిక్ ప్రవేశంలో సీట్లు సాధించారన్నారు. సైనిక్‌లో 2020లో 9వ తరగతి ప్రవేశంలో ఈ.రోహిత్ ఆల్ ఇండియా ఫస్ట్‌ర్యాంకు, కె.కుషల్ కుమార్ 6వ తరగతి ప్రవేశంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు, 2021లో 9వ తరగతిలో ఎ.పవన్‌నరసింహ, 6వ తరగతిలో జి.జాహ్నవి స్టేట్ ఫస్ట్ ర్యాంకు, 2022లో 9వ తరగతిలో టిజి.పోతన్‌రాజ్, 6వ తరగతిలో బి.మోహన్‌రెడ్డి స్టేట్ ఫస్ట్‌ర్యాంకు, 2023లో ఆల్ ఇండియా 10వ ర్యాంకు, స్టేట్ ఫస్ట్ ర్యాంకులను డి.నవదీప్, 2024లో స్టేట్ ఫస్ట్ ర్యాంకును 9వ తరగతిలో బి.లోచ్చన్, 6వ తరగతిలో ఎన్.లిఖిత కైవసం చేసుకుని జాతీయ స్థాయి సైనిక్ స్కూల్‌లో ప్రవేశం సాధించారన్నారు. మార్కుల సాధనలోనూ విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాలను ప్రతి ఒకరు సద్వినియోగం చేసుకోవాలని, ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని, వివరాలకు 9399976999, 8688888802, 03 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మేమింతే... తగ్గేదేలె..!

ఆధ్యాత్మిక కేంద్రాల్లో 'షాడో'లు
తిరుపతిలో అన్న కుమారుని సమీక్షలు
శ్రీకాళహస్తిలో అన్నిటికీ 'అమ్మే'
చంద్రగిరిలో 'అర్ధ'భాగమై...

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి సిటి

'ఎన్నికల్లో ఖర్చు పెట్టిన ధనాన్ని కూడేసుకునేందుకు స్థానిక ఎంఎల్ఎ అనుచరులు తెరదీశారు.. ఎన్నికల ఫలితాలు వచ్చి నెలలు కూడా గడవకముందే విభాగాలను పంచుకుంటున్నారు.. ప్రతి విభాగానికి ఎంఎల్ఎ అనుచరగణం అనధికారిక ఇన్‌ఛార్జిగా ఉంటున్నారు. ఎంఎల్ఎకు సంబంధించి ఏ ఫైలు వచ్చినా వారు దగ్గరుండి చూస్తారు.. అధికారుల బదిలీలు సైతం ఈ ఇన్‌ఛార్జిల చేతుల్లోనే ఉంటుంది.. ఏ పని జరగాలన్నా అనధికారిక ఇన్‌ఛార్జి చేతిలో కొంత, ఎంఎల్ఎకు కొంత సమర్పించుకుంటేనే ఆ పని అవుతుంది' అన్నమాట. అయితే అధికారులు మాత్రం ఈ అనధికారిక ఇన్‌ఛార్జిల పెత్తనంతో తలలు పట్టుకుంటున్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలకు నెలవైన తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరిలో ఈ ధోరణి జోరుగా సాగుతోంది. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలే తప్ప అధికార హోదాలో పాల్గొనడాన్ని జనం తప్పుబడుతున్నారు.

టిడిపి, బిజెపి, జనసేన కూటమి నేతలు విభేదాలు ఎన్ని ఉన్నా పక్కన పెట్టి ఆరణి శ్రీనివాసులు గెలుపే లక్ష్యంగా పనిచేశారు. నాన్‌లోకల్‌గా ఉన్న ఆరణి శ్రీనివాసులును భారీ మెజార్టీతోనే అసెంబ్లీకి పంపించారు. తిరుపతి ఒక్క నియోజకవర్గంలోనే దాదాపు ఎన్నికల ప్రచారం నుంచి పోలింగ్ రోజు వరకూ రూ.150 కోట్లపైనే వెచ్చించారని చర్చ జరుగుతోంది. ఆ డబ్బులను ఈ రూపంలో రాబట్టుకునేందుకు తలచారేమో తెలియదు. ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు బంధువర్గం, అనుచరుగులు చిత్తూరు నుంచి తిరుపతికి వలసొచ్చేశారు. టిడిపి, జనసేన, బిజెపి పార్టీ లీడర్ల ప్రమేయం లేకుండా టిటిడి, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, తుడ, రెవెన్యూ, పంచాయతీరాజ్, స్విమ్స్, రుయా, తిరుపతి కార్పొరేషన్, అటవీశాఖ, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల్లో ఆరణి శ్రీనివాసులుకు సంబంధించిన అన్నకొడుకులు, బంధుమిత్రులు, అనుచరగణం తిష్ట వేసేశారు. ఇటీవలే మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు అన్న కొడుకు శివకుమార్ అనధికారికంగా హాజరై ఎంఎల్ఎకన్నా ఎక్కువ ఆదేశాలు జారీ చేశారు. దీంతో అదితిసింగ్ సైతం ఒకింత అసహనానికి గురైనట్లు చర్చ నడిచింది. సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ పార్టీల నేతలు సైతం ఈ చర్యను ఖండించారు. ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు స్పందించి ప్రోటోకాల్ పాటిస్తారని అందరూ అనుకున్నారు. అయితే 'మేమింతే తగ్గేదెలె' అంటూ అనధికారిక ఇన్‌ఛార్జిల తీరు ఉంది. తిరుపతిలో షాడో ఎంఎల్ఎగా ఆరణి శ్రీనివాసులు అన్న జయరాం కుమారుడు ఆరణి శివకుమార్ అన్నీ తానై వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఆరణి శ్రీనివాసులు సొంత కుమారులైన ఆరణి జగన్, ఆరణి మదన్‌లను సైతం పక్కన పెట్టడం, కూటమి నేతలను పట్టించుకోకపోవడం సొంత పార్టీలోనే కుంపటి రగిలేలా ఉంది. బదిలీలు సైతం వీరి చేతిలోనే ఉండడంతో ఆరణి శ్రీనివాసులు ఇంటి చుట్టు పోలీసు అధికారులు తమను బదిలీ చేయొద్దంటూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

శ్రీకాళహస్తిలో అన్నీ అమ్మే

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కుమారుడు బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపొందారు. ఫలితాల అనంతరం వారం రోజుల పాటు విజయోత్సవాల్లో పాల్గొన్న అనంతరం ఎంఎల్ఎ తల్లి బృందమ్మ చక్రం తిప్పడం మొదలు పెట్టారు. శ్రీకాళహస్తి ఆలయంలో అధికారులతో సమావేశాలు నిర్వహించి, అన్ని విషయాలు తనకు తెలియజేయాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం. గతంలో బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డి మంత్రిగా ఉన్నపుడూ ఆమె ఆలయ వ్యవహారాలను పర్యవేక్షించేవారు. ఇపుడు కొడుకు హయాంలోనూ ఆమె కనుసన్నల్లోనే సాగుతున్నట్లు చర్చ నడుస్తోంది. మాజీ మంత్రి బొజ్జల 'ముద్ర' వేయడానికే బృందమ్మ ప్రయత్నిస్తున్నారని ఆ పార్టీ నేతలు చెబుతుండటం గమనార్హం.

అధికారంలోనూ అర్ధబాగమై

భార్యాభర్తలు ఇద్దరూ సమానమే అన్న నినాదం చంద్రగిరిలో ఎంచక్కా సాగిపోతోంది.. చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి పార్టీ నాయకులతోనూ, కార్యకర్తలతోనూ మండల, గ్రామస్థాయి సమావేశాలను నిర్వహిస్తూ అన్నీ తానే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పింఛన్ల పంపిణీలోనూ ప్రోటోకాల్ పాటించకుండా ఉండటం వివాదాస్పదం అవుతోంది. ఎంఎల్ఎ కంటే ఆమెను ప్రసన్నం చేసుకుంటే చాలన్న చర్చ చంద్రగిరి నియోజకవర్గంలో నడుస్తుండటం గమనార్హం.

ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపల్ పాత కార్యాలయంలో టాటా ట్రస్ట్ తిరుపతి సహ కారంతో పుత్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యం లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి టాటా ట్రస్ట్ క్యాన్సర్ హాస్పిటల్ సహ కారంతో తిరుపతి జిల్లాలో అనేక పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ పుత్తూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్ వాడీ కార్యకర్తలు అందరి సౌకర్యార్థం గర్భసంచి, రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత స్క్రీనింగ్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్‌లను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పుత్తూరు ప్రాజెక్టు అధికారి సిడిపిఓ కసిరెడ్డి పద్మజ, సూపరు వైజర్లు బి గీతాంజలి, పి సంధ్య , టాటా ట్రస్ట్ సిబ్బంది డాక్టర్ వెంకయ్య బాబు, హేమంత్ కుమార్ రెడ్డి, కుమారి మెహతాజ్ వినీత పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: యర్రావారిపాలెం మండలంలోని కూర పర్తివారి పల్లి పంచాయతీ ఆవులయ్యగారి పల్లిలో మూడు నెలలుగా తాగునీరు బోరు మరమ్మతులకు గురై గ్రామ ప్రజలు తాగు నీటి సమస్యతో సతమతమయ్యేవారు. ఎమ్మెల్యే పులివర్తి నానికి ఈ సమాచారం అందివ్వడంతో వెంటనే తాగునీటి బోరుకు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపిటిసి ఈశ్వరమ్మ, టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, సెక్రటరీ వెంటనే బోరుకు మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామస్తులకు తాగునీటి సమస్య పరిష్కారమైంది.

పెంపుడు కుక్కలకు ఉచిత టీకాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు శనివారం ఉచితంగా టీకాలు వేశారు. ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా పాడి రైతులకు , పెంపుడు కుక్కల యజమానులకు జూనోటిక్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం 52 కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా గూడూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయక సంచాలకులు సురేష్ మాట్లాడుతూ మూగ జీవులపట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ కలిగి ఉండాలని పేర్కొన్నారు. పెంపుడు జంతువులు పెంచుకుంటున్న యజమానులు జంతువులు పట్ల పరిశుభ్రత పాటించాలని, ఎప్పటికప్పుడు జంతువులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని తెలిపారు. వైద్యులు సూచించిన సూచనల మేరకు టీకాలు వేయించాలన్నారు. నిర్లక్ష్య ధోరణి తగదన్నారు. గూడూరు పశు వైద్యశాలలో పెంపుడు జంతువుల వ్యాధులకు వైద్యం చేసేందుకు వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు.

తిరుపతి డెస్క్: కేవిబి పురం మండల కేంద్రంలోని పాడి రైతులకు, పెంపుడు కుక్కల యజమానులకు జంతువుల నుండి పశువులకు, మనుషుల నుండి జంతువులకు సంక్ర మించు వ్యాధులు జూనోటిక్ వ్యాధుల గురించి గ్రామాల్లో శనివారం అవగాహన కల్పించారు. అనంతరం 52 కుక్కలకు రేబిస్ రాకుండా ఉచిత టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది జగదీష్ మాట్లాడుతూ మూగ జీవలు పట్ల నిర్లక్ష్య ధోరణితో ఉండకూడదని తెలిపారు. కెవిబిపురం మండలం పశు వైద్యశాలలో పెంపుడు జంతువుల వ్యాధులకు వైద్యం అందించేందుకు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలి: చింతా మోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో క్రికెట్ స్టేడియాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రికెట్ స్టేడియం అంశాన్ని పరిశీలించి నిర్మాణం చేపట్టాలని మాజీ ఎంపీ చింతామోహన్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తిరుపతి నగరంలో వేలాది మంది చిన్నారులు ఆట స్థలాల కొరతతో రోడ్లపైనే ఆటలాడుకుంటున్నారని, టిడిడి పరిపాలన భవనం వెనుక వైపు ఉన్న స్థలంలో పిల్లలు ఆడుకునేలా టిటిడి అనుమతులు ఇవ్వాలన్నారు. అలిపిరి జూ పార్కును వేరొక చోటుకు తరలించి అక్కడ పేదలకు, జర్నలిస్టులకు ఐదు సెంట్ల భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే నేడు దేశం బలంగా ఉందని, ఓటు హక్కు లాగా ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం పొందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి, తేజోవతి, శాంతి యాదవ్ పాల్గొన్నారు.

ఎంపీ గురుమూర్తి పర్యటన

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఆలత్తూరు లో టిడిపి నాయకుల దాడిలో గాయపడిన వైసిపి కార్యకర్త కత్తి చెంచమ్మ కుమార్తెలను ఎంపీ గురుమూర్తి పరామర్శించారు. ఆలత్తూరు గ్రామం బాలకృష్ణమ్మ ఆశ్రమం కూడలిలో ఎంపీ నిధులతో బస్సు షెల్టర్ నిర్మాణానికి ఎంపీ అంగీకరించారు. స్థానిక వైసిపి ఇన్‌ఛార్జి నూకతోటి రాజేష్‌తో కలిసి బిఎన్‌కండ్రిగ మండలం ఆలత్తూరులో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సంఘటనను ఇప్పటికే ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే న్యాయం చేస్తామని తెలిపారని వారికి వివరించారు. స్పందించి సమస్యలను పరిష్కరించినందుకు గ్రామస్థులు ఆయకు కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడ అన్యాయం జరిగినా అధికార పక్షం అన్యాయం వైపు కొమ్ము కాసినా ప్రజల వైపు, న్యాయం వైపు మనం కచ్చితంగా నిలబడాల్సిన సమయం వచ్చిందని కలిసి పోరాడుదామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై సీతా రాముల విహారం


ప్రజాశక్తి -రామచంద్రపురం(చంద్రగిరి): పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో సీతా లక్ష్మణ సమేత శ్రీ రాములు, హనుమంతులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, టెంపుల్ సూపరింటెండెంట్ నర్రా ముని చంగల్ రాయల్, అర్చకం ఇన్స్పెక్టర్ ఆనంబట్ల ధన శేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను కళ్యాణదుర్గం ఏడిఏ కాలప్ప ఆధ్వర్యంలో శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను నష్టపరిచే విధంగా నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయించే దుకాణాలను చట్టపరంగా సీజ్ చేస్తామన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అధిక ధరలకు విక్రయించకుండా ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని సూచించారు. కొనుగోలు చేసిన ప్రతి రైతు ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఏడిఏ ధనుంజయ రెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ జీవ, శ్రీకాళహస్తి ఏపిఏ రమేష్ రెడ్డి, శ్రీకాళహస్తి మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపిడివో ఇందిరమ్మ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఎన్నికల సమయంలో జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి బదిలీపై పుత్తూరు ఎంపిడివోగా వచ్చిన ప్రసాదరావును ప్రభుత్వ ఆదేశాల మేరకు యథా స్థానానికి బదిలీ చేశారు. దీంతో గతంలో ఎన్నికలకు ముందు ఎంపిడివోగా విధులు నిర్వహించిన ఇందిరమ్మ ప్రభుత్వ ఆదేశం మేరకు మళ్లీ పుత్తూరు ఎంపిడివోగా బదిలీ అయ్యారు. శనివారం ఆమె పుత్తూరు ఎంపిడివోగా బాధ్యతలు స్వీకరించారు.

'కండలేరు' నీరు విడుదలకు చర్యలు చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి: కండలేరు పూడిక తీత పనులను త్వరితగతిన పూర్తి చేసి తిరుపతి పట్టణానికి ఈ నెల 21వ తేదీ నాటికి తాగునీటి సరఫరాకు నీటి విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత ఇరిగేషన్, తిరుపతి మునిసిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ మునిసిపల్ కమిషనర్ అదితి సింగ్ తో కలిసి తిరుపతి పట్టణంలోని ప్రజలకు తాగు నీటిని సరఫరాకు నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ ఇరిగేషన్ విజయ కుమార్, మునిసిపల్ అధికారులతో సమీక్షిస్తూ కండలేరు జలాశయం నుండి నీటిని పట్టణ ప్రజలకు తాగు నీటి విడుదల కోసం జలాశయంలో పూడిక తీత టెండర్లు ఈ నెల 9 నాటికి చేపట్టి అనంతర ప్రక్రియ ప్రణాళికా బద్ధంగా చేపట్టి ఈ నెల జులై 21వతేదీ నాటికి తిరుపతి మునిసిపాలిటీకి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని, రోజుకు 250 క్యూసెక్కుల నీటిని ఒక నెలపాటు విడుదల చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ పబ్లిక్ హెల్త్ మోహన్, నెల్లూరు తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ ఈ రమణారెడ్డి, నెల్లూరు కండలేరు ప్రాజెక్టు ఈ ఈ విజయ్ కుమార్ రెడ్డి, వెంకటగిరి తెలుగంగ ప్రాజెక్ట్ ఈ ఈ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

'మహిళలపై హింస - చట్టాలు' పై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : మహిళలపై రోజురోజుకూ హింస పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మహిళా చట్టాలు, వాటిలో పొందుపరిచిన వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవలసిన అవసరం ఎంతైనా వుందని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. కే .హైమావతి పేర్కొన్నారు. మహిళలపై హింస- చట్టాలపు, సమాజ పాత్ర' అంశంపై వారు శనివారం ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై దాడులు, కిడ్నాప్‌లు అత్యాచారాల సంఖ్య పెరిగిందని 2023వ సంవత్సరం మహిళలపై జరుగుతున్న నేరాల రేటు నాలుగు శాతం పెరిగిందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా వెల్లడించిందని ఈ నేపథ్యంలో ప్రతి ఒక్క మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిర్భయ చట్టం ,ఫోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, వరకట్న నిషేధ చట్టం గృహింస నిషేధ, నియంత్రణ చట్టం, సైబర్ నేరాలు నియంత్రణ, పని ప్రదేశాలలో లైంగిక హింస వేధింపుల నియంత్రణ చట్టం ,అనైతిక కార్యకలాపాలకు మహిళలను తరలించడం వాటికి సంబంధించిన వివిధ సెక్షన్లు శిక్ష కాలం, జరిమానా తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కొత్త క్రిమినల్ చట్టాలు మహిళల హక్కులను కాపాడుతాయని అందులో భారతీయ న్యాయ సంహిత , భారతీయ నాగరిక సురక్ష, సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినియమం భారతీయ న్యాయ వ్యవస్థలో నేర విచారణ విధానాలలో కొత్త మార్పులు తీసుకొచ్చాయన్నారు. మహిళలపై హింసకు కారకులెవరు? వారిని ఏ పద్ధతులను ఉపయోగించి నియంత్రించవచ్చు? వారిని సరైన మార్గంలో నడిపించడమే కాకుండా మహిళలపై మంచి దృక్పథాన్ని పెంచుకునేటట్లు చేయడంలో కుటుంబం, సంఘాలు, సముదాయం, టీచర్లు, వివిధ గ్రామ సంఘాలు, సచివాలయ సిబ్బంది ఎలాంటి పాత్ర పోషించి సమ సమాజ స్థాపన కోసం మహిళల అభివృద్ధి సాధించడానికి సహకరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన శాఖ సిబ్బంది డాక్టర్ .ఎం .ఇంద్రాణి, ప్రీతి, కమ్యూనిటీ కోఆర్డినేటర్ సురేష్ రెడ్డి, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.


మహిళల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ హైమవతి

గిరిజనులపై తెలుగు తమ్ముళ్ల దౌర్జన్యం

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఇలాకాలో గిరిజనులకు భద్రత కరువైందని తెలుస్తోంది. మండలంలోని యంజీఆర్ గిరిజన కాలనీ వాసులు, వారి సొంతింటి అవసరాలకోసం చెరువు మట్టిని తరలించుకుంటుండగా అక్కడికి టిడిపికి చెందిన ఓ నాయకుడు వచ్చి అడ్డుకున్నారు. 'మీరంతా…వైసిపికే ఓటేశారు..మీకు ఎలాంటి పనులు జరగనివ్వను' కావాలంటే మట్టి తోలకం ఆపడానికి ఎమ్మెల్యే లెటర్ ద్వారా అయినా అడ్డుకుంటామని ఏం చేసుకోలేరంటూ బెదరింపులతో దౌర్జన్యాలకు దిగారు. దీంతో చేసేది ఏమిలేక గిరిజనులు ఊరుకున్నారు. ఇదే ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, వైసిపి హయాంలో ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు టన్నుల కొద్దీ మట్టిని తమిళనాడు ప్రాంతాలకు తరలిస్తూ..గ్రామీణ ప్రాంత రోడ్లను అస్తవ్యస్తం చేసి కోట్లాది రూపాయలను మూటగట్టుకున్నారన్నారు. అప్పుడు లేని ఆంక్షలు గిరిజనులు వారి స్వంత పంచాయతీలో సొంత ఇళ్లకు మట్టిని తరలిస్తే నేరమా…?' అని అని ఇక్కడి గిరిజనులు చర్చించు కుంటున్నారు. ఈ విషయాన్ని సదరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని పోయినా ఆయన సరైనవిధంగా స్పందించే పరిస్థితిలో లేకపోవడం బాధాకరమని విమర్శలు ఉన్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం చెరివి 132 కె.వి సబ్ స్టేషన్‌తో పాటు ఇరుగుళం సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు జూలై 7వ తేదీ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు చెరివి విద్యుత్ శాఖ ఏఈ జగదీష్ పేర్కొన్నారు.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.132 కె.వి సబ్‌స్టేషన్ మరమ్మతు, విద్యుత్ తీగలు వద్ద చెట్లు తొలగింపు వంటి పనులు నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో శ్రీసిటీ ప్రాంతంలో నడుస్తున్న కంపెనీలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీంతో పాటు గృహ అవసరాలకు, వ్యవసాయానికి కూడా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆయన వివరించారు. ఈ క్రమంలో శ్రీసిటీ ప్రాంతాల్లోనే అన్ని గ్రామాలతో పాటు పరిశ్రమలకు కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న కారణంగా దీన్ని పారిశ్రామిక వేత్తలు, గృహ వినియోగదారులందరూ గమనించాలని ఆయన కోరారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల పైన యధావిధిగా విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

మఠం భూముల్లో ఆక్రమణల కూల్చివేత



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ స్వామీ హాథిరాంజీ మఠంకు చెందిన భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను శనివారం మఠం అధికారులు మఠం పరిపాలన అధికారి రమేష్ నాయుడు ఆదేశాలతో జెసిబి సాయంతో కూల్చివేశారు. తిరుపతి గ్రామీణ మండలం అవిలాల గ్రామపంచాయతీ పరిధిలో 13, 15, 17/2, 17/3, 17/5 లలో 174.75 ఎకరాల శ్రీ స్వామి హథిరాంజీ మఠంకు చెందిన భూమి ఉంది. ఈ భూమిని రిజిస్టర్ డాక్యుమెంట్లు నెంబర్లు 985/1884, 985/1884 ద్వారా బుగ్గ మఠం నుండి కొనుగోలు చెశారని, ఈమధ్య కాలంలో కొచ్చి శేషగిరి అనేవ్యక్తి తమకు ఈ భూమిలో కొంత భాగం వారసత్వంగా వచ్చిందని నమ్మ బలుకుతూ కొంత మంది ల్యాండ్ మాఫీయా సాయంతో మఠం భూమిని అక్రమ లేఅవుట్ల ద్వారా రిజిస్ట్రేషన్ లేకుండా స్టాంపు పేపర్ల పైన అమ్మి ప్రజలను మోసం చేస్తున్నారన్న సమాచారంతో మఠం సిబ్బంది గుర్తించి శనివారం ఈ భూమిని సందర్శించారు. మటంకు చెందిన స్థలంలో అక్రమంగా జరుగుతున్న 2 (రెండు) నిర్మాణాలను జెసిబి యంత్రం సహాయంతో నేల కూల్చామన్నారు. అక్రమ కట్టడాల కూల్చివేత సందర్భంలో అక్రమ నిర్మాణ దారులు జెసిబి డ్రైవర్పై చేయి చేసుకోవడం, మఠం సిబ్బందిని బెదిరించారన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివాదం సృష్టిస్తున్న వారిని వారించి అక్కడ నుండి పంపించి వేశారన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సేవ నిమిత్తం ఏర్పాటు చేసిన శ్రీ స్వామి హథిరాంజీ మఠంకు చెందిన భూములను కొందరు ల్యాండ్ మాఫియాగా ఏర్పడి అమాయక ప్రజలకు తమదంటూ అమ్మకాలు చేస్తున్నారని, ప్రజలు భూముల కొనుగోలులో జాగ్రత్త వహించాలని మఠం పరిపాలన అధికారి రమేష్ నాయుడు విజ్ఞప్తి చేశారు. మఠం భూములను తమదంటూ విక్రయాలు జరుపుతున్న కొచ్చి శేషగిరి, ఇతర అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి త్వరలో చర్యలు తీసుకుంటు న్నామని స్పష్టం చేశారు. స్టాంపు పేపర్లపై మటన్ భూములను విక్రయిస్తున్న ల్యాండ్ మాఫియా మాయ మాటలకు మోసపోయి నష్టపోవద్దని హితవు పలికారు

నిజ నిర్ధారణ కమిటీ వేయండి..

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కొర్లగుంట ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న స్థల వివాదం సమసిపోవాలంటే జిల్లా ఉన్నతాధికారులతో నిజనిర్ధారణ కమిటీ వేసి స్థలాన్ని సర్వే చేయించాలని టిడిపి నాయకులు కంకణాల రజనీకాంత్ నాయుడు విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాన్యుడిగా గోపికృష్ణారెడ్డి అనే వ్యక్తి వారి స్థలం కోసం బండి వెంకటసుబ్బమ్మ, జయరామిరెడ్డితో పోరాడ లేక తన సాయం అర్జించారన్నారు. ఒక నాయకుడిగా గోపికృష్ణారెడ్డి అడిగిన సహాయానికి పోలీసు వారితో, రెవెన్యూ అధికారులతో మాట్లాడి అతనికి సహాయం చేయాలని విజ్ఞప్తి మాత్రమే తాను చేశానని, అయితే తనను సామాజిక మాధ్యమాల వేదికగా కబ్జాదారుడుగా చిత్రీకరిస్తున్నారని అది ఎంత మాత్రం నిజం కాదన్నారు. ప్రభుత్వం నుండి బండి వెంకటసుబ్బమ్మ పొందిన 2.1/4 సెంటు భూమి, మండల తహశీల్దారు కార్యాలయం నుండి 66 అంకనాలకు ఎంజయ్‌మెంటు సర్టిఫికెట్, ఇప్పుడు తమదంటూ వాదిస్తున్న 90 అంకణాలు స్థలం ఏది నిజమో అర్థం కావడం లేదన్నారు. గోపికృష్ణ రెడ్డికి చెందిన భూమి సర్వే చేయిస్తే ఎక్కడ ఉందో ఎంత ఉందో తెలుస్తుందన్నారు. వాస్తవంగా భూకబ్జాకు పాల్పడుతోంది ఎవరో అధికారులు కమిటీ వేస్తే నిగ్గు తేలిపోతుందన్నారు. ఈ సమావేశంలో గోపికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఉన్నతాధికారులకు టిడిపి వినతి



సీజనల్ వ్యాధులపై అవగాహన


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ దివాకర్ ఆదేశాల మేరకు ఆరోగ్య అధికారి డీఎస్ వెంకటేశులు మండలంలోని వేణుగోపాలపురం యానాది కాలనీలో సీజనల్ వ్యాధులపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లోరినేషన్ చేసిన నీటిని తాగడం, నీటిని కాచి చల్లార్చి తాగడం, తాజా ఆహారం , వేడి ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. చేతులు, పరిసరాలను పరిశుభ్రంగా వుంచు కోవడం, ఈగలు లేకుండా చూసుకోవడం వల్ల డయేరియా నుండి విముక్తి పొందవచ్చన్నారు. డయేరియా బారిన పడిన వారు ఓఆర్ఎస్ ప్యాకెట్ ఒక లీటరు నీటిలో కలిపి కొద్ది కొద్దిగా తాగడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుండి బయటపడవచ్చని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం, ఇళ్ల వద్ద టెంకాయ చిప్పలు, ప్లాస్టిక్ కప్పులు పనికిరాని రోళ్లు, నిరుపయోగ టైర్లు లేకుండా చూసుకోవా లన్నారు. వర్షపు నీరు నిలవకుండా చేసి దోమల అభివృద్ధిని నిరోధించవచ్చన్నారు. చిన్న పొదలు, చిన్న చిన్న గుంతలు లేకుండా చూసు కోవడం ద్వారా దోమలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. దోమతెరలు వాడడం, వేపాకు పొగ వేసుకోవడం ద్వారా దోమలు కుట్టకుండా కాపాడు కోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు పట్టణం శ్రీవెంకటేశ్వర 24 గంటలు ప్రైవేటు ఆసుపత్రి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన లభించింది. శ్రీవెంకటేశ్వర ఆసుపత్రి అధినేత డాక్టర్ రాజేంద్రన్ పర్యవేక్షణలో చెన్నై శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 143 మంది రోగులు హాజరయ్యారు. వీరిని కంటి వైద్య నిపుణులు అరవింద్,మునివేలు పరీక్షించి చికిత్స చేశారు. 48 మంది రోగులను కంటి ఆపరేషన్ చేయడానికి డాక్టర్లు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో మాదరపాకం సామాజిక కార్యకర్త కిషోర్ కుమార్, పలువురు రోగులు పాల్గొన్నారు.

రైతుల మోటారు స్టార్టర్లు చోరీ

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం మోదుగులపాలెం గ్రామం పంట పొలాల్లో మోటార్ల స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. వరి ముమ్మరంగా సాగులో ఉండగా ఈ స్టార్టర్ లు చోరీకి గురి కావడం రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. మోదుగులపాలెం రైతులు సంబంధిత అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నకిలీ పత్రాలతో భూకబ్జాకు యత్నం

- కోర్టు తీర్పును విస్మరించి నిర్మాణాలు - బాధితుల ఆవేదన



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తమ తాత ముత్తాతల నుండి సంక్రమించిన భూమిని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కోర్టు కేసులలో ఇరికించి దౌర్జన్యంగా కబ్జాకు యత్నిస్తున్నారని వేదాంతపురం గ్రామానికి చెందిన రైతులు అవిలాల లోకనాథరెడ్డి, వాసుదేవరెడ్డిలు వాపోయారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో భనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ భూ కబ్జాకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. తుమ్మలగుంట రెవెన్యూ లెక్కదాకలా వేదాంతపురం గ్రామ పంచాయతీలోని సర్వే నంబర్లు 216, 221/1, 221/2, 219/10 లోని ఒక ఎకరా 97 సెంట్లు భూమికి సంబంధించి గతంలో ఎవరికీ అమ్మకాలు చేయలేదన్నారు. ఈ భూమిని మాసా కృష్ణమూర్తి, మమత, బిల్డర్ శ్రీనివాస్ నకిలీ డాక్యు మెంట్లతో కబ్జి చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. అడ్డుకుంటే స్థానిక కోర్టు, జిల్లా కోర్టు, తర్వాత హైకోర్టులలో కేసులు వేశారన్నారు. వారు వేసిన కేసులలో ఇప్పటికే మూడుసార్లు న్యాయస్థానం ఆ భూమి తమకే చెందుతుందని తీర్పు ఇచ్చారన్నారు. అయినా ఎలాగైనా భూమిని దక్కించుకోవాలనే ఉద్దేశంతో మళ్లీ హైకోర్టులో దావా వేశారన్నారు. హైకోర్టు ఇంజక్షన్ ఆర్డర్‌ను ఇచ్చిందని, ఈ ఆర్డర్ ను గౌరవించి కొద్ది రోజులు భూమిలోకి ప్రవేశించలేదన్నారు. వారం రోజుల నుండి కోర్టు ఈ భూమిలో దౌర్జన్యంగా నిర్మాణ పనులు సాగిస్తుండడంతో వెళ్లి అడ్డుకు న్నామని, ఈ భూ సమస్యకు రాజకీయరంగు జోడించి వివాదాస్పదం చేయడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు. తమకు సంక్రమించిన భూమిని తాము కాపాడుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలకు రాజకీయాలు జోడించడం మంచి పద్ధతి కాదన్నారు. కోర్టు ఉత్తర్వులను విస్మరించి దౌర్జన్యంగా నిర్మాణాలు చేస్తున్న వారిపై కోర్టుధిక్కార పిటిషన్ వేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పొన్నాల చంద్రశేఖర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి కడప జిల్లా ఖాజీపేట మండలంలోని పొద్దుటూరు అటవీ ప్రాంతంలో శనివారం 53 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక మోటారు సైకిల్ సహా ముగ్గురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఇన్‌ఛార్జి, తిరుపతి ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ అధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్ కు చెందిన ఆర్ఎస్ఐ పి. నరేష్ బృందం శుక్రవారం రాత్రి పొద్దుటూరు రేంజిలోని ఖాజీపేట ఫారెస్టు డివిజన్ నుంచి కూంబింగ్ చేపట్టారని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. కూంబింగ్ బృందం శనివారం తెల్లవారు జామున నాగసానిపల్లి రేంజిలోని పోత భక్తుని బావి ప్రాంతం చేరుకునే సమయానికి కొందరు వ్యక్తులు మోటారు సైకిల్ తో అనుమానాస్పదంగా కనిపించారన్నారు. వారి దగ్గరికి వెళ్లే క్రమంలో వారు టాస్క్ ఫోర్స్ సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. టాస్క్ ఫోర్సు పోలీసులు ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని విచారించగా ఎర్రచందనం దుంగలను కొంతమంది కూలీల నుండి సేకరించి రవాణా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారన్నారు. ఆ ప్రాంతంలో 53 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టయిన వారిని కడప జిల్లా ఖాజీపేట మండలానికి చెందిన దాడిబోయిన గురుప్రసాద్ (37), మైదుకూరు మండలంకు చెందిన తమ్మిశెట్టి వెంకటేష్ (24), బత్తల శివ (25)లుగా గుర్తించామన్నారు. పారిపోయిన మరో ముగ్గురి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. అరెస్టయిన వారిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ.20లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య


విద్యార్థులకు విద్యాసామగ్రిని అందిస్తున్న ఎంఈవో సతీష్

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈవో సతీష్ పేర్కొన్నారు. యర్రావారిపాలెం మండలం ఉదయమాణిక్యం పంచాయతీ తొగటిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో సతీష్ విద్యార్థులకు శనివారం విద్యా సామగ్రి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కోన ప్రాథమిక పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న చెంగల్ రాయుడు తన సొంత ఖర్చులతో తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించడం చాలా సంతోషంగా వుందని ఎంఈఓ తెలిపారు. ఎంతో ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యార్థులకు సేవ చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చిందని కొనియాడారు. విద్యార్థులు విద్యా ప్రమాణాలతో బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని చెంగల్ నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణ: సిఐ



హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సిఐ పాపారావు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : హెల్మెట్ ధరిస్తే ప్రాణాలు రక్షిం చుకోవచ్చని ఒకటవ పట్టణ సిఐ పాపారావు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద వాహన దారులకు హెల్మెట్‌పై శనివా రం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసేటప్పుడు ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి బయటపడేందుకు హెల్మెట్ ఎలా ఉపయోగ పడుతుందో అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో పట్టణ ఎస్ఐ శ్రీహరి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సీనియర్ న్యాయవాది కె మురుగేష్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవ అధికారి సంస్థ, జిల్లా న్యాయ సేవ అధికారి, సంస్థ పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర ఆదేశాల మేరకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మండల న్యాయ సేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది ఎన్ మురుగేషన్ రెడ్డి మాట్లాడుతూ మనిషి జీవిత కాలం విలువైందని ద్విచక్ర వాహనాలు నడిపినప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించుకోవాలని హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడవచ్చని తెలిపారు. నూతన మోటారు వాహనం చట్ట ప్రజలకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఆర్టిసి డిపో మేనేజర్ ప్రశాంతి, ప్రయాణికులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరిని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కుటుంబ సమేతంగా శుక్రవారం అమ్మ వారిని దర్శించుకున్నారు. వారిని సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి, డబ్బు గుంట వెంకటేశ్వర్లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు పూజలు నిర్వహించి అనంతరం సత్కరించారు.

విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావన పెరగాలి

టిటిడి హిందూధర్మ ప్రచార మండలి సభ్యుడు రాజ్‌కుమార్


మాట్లాడుతున్న టిటిడి హిందూధర్మ ప్రచార మండలి సభ్యుడు రాజ్‌కుమార్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావాలు పెరగాలని టిటిడి హిందూ ధర్మ ప్రచా ర మండలి జిల్లా సభ్యుడు రాజ్ కుమార్ సూచించారు. పట్టణం లోని శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ విద్యా జ్యోతి ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో శనివారం టిటిడి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి శతనామావళి ని నిర్వహించారు. 600 మంది విద్యార్థుల చేత 108 సార్లు వెంకటేశ్వర స్వామి శతనామావళి రాయించారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావన పెరిగితే క్రమశిక్షణ, పట్టుదల, శాంతి పెరుగుతుందని ఆయన సూచించారు. తద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. కరెస్పాండెంట్ సి. సంయుక్తా రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సి.ప్రవీణ్ కుమార్ రెడ్డి, అవదూత మాసపత్రిక ఎడిటర్ అక్కుర్తి ఆనంద రెడ్డి పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

గొర్రెల, మేకల పెంపకం దారుల సొసైటీ అధ్యక్షుడు వాడ గంగరాజు



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: గత రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పెంపకం దారుల సొసైటీలను నిర్వీర్యం చేయడంతో గొర్రెల సొసైటీ లకు రుణాలు రావడం రాలేదని ప్రస్తుత ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వాలని లక్ష్మీ వెంకటేశ్వర గొర్రెల పెంపకదారుల సంఘం అధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. తిరుపతి వెటర్నరీ యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన గొర్రెల మేకల పెంపకం దారుల యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో గంగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం జిల్లాలో ఉన్న 245 గొర్రెలు మేకల పెంపకం దారుల సొసైటీలో ఉన్నప్పటికీ నూతన రుణాలు ఇవ్వలేదన్నారు. దాంతో పెంపకం దారులకు ఆర్థిక సహాయం అందక చాలా ఇబ్బందులు పడ్డారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న జీవోలు ప్రకారం పెంపకం దారులకు ప్రభుత్వ భూములు కేటాయించాలని, 50 సంవత్సరాలకే పెంపకం దారులకు పింఛన్లు ఇవ్వాలని, పెంపకం దారులకు రక్షణ కల్పించాలని అనేకసార్లు డిమాండ్ చేసిన ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వమైన గొర్రెల మేకల పెంపకం దారుల సొసైటీలను బలోపేతం చేయడానికి పెంపకం దారులకు సబ్సిడీతో కలిగిన రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మొన్న జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వాన్ని అధికారంలో కి తీసుకురావడానికి పెంపకం దారులు అందరు కూడా కృషి చేశారన్నారు. అలాంటి పెంపకం దారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గతంలో ఫెడరేషన్ రుణాలను దుర్వినియోగం చేశారని ప్రస్తుతం ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉన్న ఆస్తులను కాపాడి ఫెడరేషన్ ఆదాయానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఛైర్మన్ ప్రకాష్ యాదవ్, పెంపకం దారుల సొసైటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

'అన్నమాచార్యలో' గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గం లోని అన్నమాచార్య ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో రెండవ గ్రాడ్యుయేషన్‌డే ను శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ, ఐజర్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె విజయ మోహనన్ పిళ్ళై హాజరై విద్యార్థులకు విలువైన సలహాలు అందించారు. ఉత్తీర్ణులైన 695 మంది బీటెక్ విద్యార్థులకు, 60 మంది పీజీ విద్యార్థులలో 503 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి నాధముని రెడ్డి 2023-24 సంవత్సరానికి సంబంధించిన విద్యా నివేదికను వివరించారు. గ్రాడ్యుయేషన్ డేను ప్రారంభించిన కళాశాల ఛైర్మన్ సి గంగిరెడ్డి మాట్లాడుతూ విద్య ఒక గుప్త నిధి లాంటిదని, చదువుకున్న వ్యక్తికి ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ కెమికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌ల అవకాశాలను వివరించారు. భారతదేశం అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, ఈవీ రంగంలో మరిన్ని పరిశ్రమలు వస్తున్నాయని, ఇంధన నిల్వ, స్థిరత్వం లాంటి సెక్టార్లలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఐజర్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విజయ్ మోహనన్ పిళ్ళై విద్యార్థి కెరీర్ వృద్ధికి సరైన పరివర్తన, ప్రాముఖ్యతను వివరించారు. ఈ రెండవ గ్రాడ్యుయేషన్ డేలో యూనివర్సిటీ ప్రతినిధి ప్రొఫెసర్ వి వేణుగోపాల్ రెడ్డి విద్యార్థులను అభినందించారు.



అన్నమాచార్య గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ముఖ్య అతిథులు